క్లుప్తంగా

భారీ అన్నసమారాధన



మాచవరంలో వేంచేసిన గణపతి

అంబాజీపేట: మాచవరంలో వేంచేసిన యువ గణపతి ఆలయ ప్రాంగణంలో మహాశివరాత్రి ఏకాహ మహోత్సవ 33వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. మాచవరం పార్వతీ సమేత కందుల మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద, అంబాజీపేట శివపురం లోను భారీ అన్నసమారాధనలు నిర్వహించారు.

వేంకటేశ్వరునికి పంచామృతాభిషేకం

మలికిపురం: స్థానిక ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ ధర్మకర్త ఉయ్యూరి హరి ప్రసాదరాజు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

సర్రాజుకు ఘన నివాళి



సర్రాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, ఉండి మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు మృతికి రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఉండి వెళ్లి సర్రాజు నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు కేఎస్ఎన్ రాజు తదితరులు ఉన్నారు.

శ్రీనివాసరావుకు మాతృవియోగం

అంబాజీపేట: ది కోనసీమ కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్ సెక్రటరీ మేడిద శ్రీనివాస రావు తల్లి సూర్యనారాయణమ్మ (89) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. మృతురాలికి ఐదుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. సూర్యనారాయణమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు కొర్లపాటి కోటబాబు, కొర్లపాటి గోపి, మర్చంట్ అసోసియేషన్ ప్రముఖులు శ్రద్ధాంజలి ఘటించారు.

ప్రభుత్వ పెన్షనర్లు ఈ-కేవైసీ చేయించుకోవాలి

మామిడికుదురు: ప్రభుత్వ పింఛన్‌దారులు విధిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని రాజోలు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. ఆయన ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈకేవైసీ కోసం ప్రభుత్వ పింఛన్‌దారులు మొబైల్ నంబర్ 94937 78994 ద్వారా తనను సంప్రదించాలన్నారు. పింఛన్ నంబర్‌తో పాటు ఆధార్ లింక్ మొబైల్‌నంబర్‌తో తనను సంప్రదిస్తే ఉచితంగా ఈ-కేవైసీ చేస్తానన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

వీరవల్లిపాలెంలో సత్తెమ్మ తల్లి జాతర

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో ఆదివారం సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాలు జరిపారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని కానుకలు, మొక్కులు చెల్లించారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సత్తెమ్మ తల్లిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు వేటుకూరి వెంకట్రాజు, కటకంశెట్టి ఆదిత్య తదితరులు ఉన్నారు.

భారీ అన్నసమారాధన

ఆలమూరు: మండలంలోని కలవచర్లలో ఆదివారం భారీ అన్నసమారాధన జరిగింది. మహాశివరాత్రి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక శివాలయం వద్ద నిర్వహించిన ఈ అన్నసమారాధనలో పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు ఐదు వేల మంది భక్తులు పాల్గొన్నారు. అన్నసమారాధనకు సహకరించిన మురళీకృష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు, గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబును ఘనంగా సత్కరించారు. ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

నేడు చండీహోమం

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసియున్న నూకాంబికా అమ్మవారి ఆలయంలో సోమవారం చండీహోమం జరగనుందని ఈఓ ఉండవల్లి వీర్రాజు చౌదరి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా అమావాస్య రోజున వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఈ హోమాన్ని నిర్వహించనున్నామన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు విచ్చేసి ఈ హోమాన్ని తిలకించి అమ్మవారిని దర్శించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రైతులకు 'ఉపాధి'తో బాసట

- కొబ్బరిచెట్ల చుట్టూ పళ్లాలు
- పంట కాలువల అభివృద్ధి



పెదపట్నంలంకలో కొబ్బరిచెట్ల చుట్టూ పళ్లాలు తవ్వుతున్న కూలీలు

మామిడికుదురు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రైతులకు ఎంతో బాసటగా నిలుస్తోంది. ఈ పథకం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చే పనులు నిర్వహిస్తున్నారు. ముందుగా గ్రామ సభల ద్వారా పనులను గుర్తించి వాటిని చేపడుతున్నారు. వేసవి సీజన్‌లో కొబ్బరి రైతులతో పాటు వరి సాగు చేసే మాగాణి రైతులకు ఉపయోగపడే పనులు చేపడుతున్నారు. 2019 నుంచి కొబ్బరి రైతులకు ఈ పథకం వరంగా మారింది. ఏటా కొబ్బరి రైతులు చెట్ల చుట్టూ పళ్లాలు తవ్వించేందుకు వేలాది రూపాయలు ఖర్చు చేసేవారు. నాలుగేళ్ల నుంచి గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా కొబ్బరి చెట్ల చుట్టూ పళ్లాలు ఏర్పాటు చేస్తున్నారు. కొబ్బరి రైతులు ఒక్క కొబ్బరి చెట్టు చుట్టూ పళ్లెం తవ్వేందుకు రూ.60 ఇచ్చేవారు. నాలుగేళ్ల నుంచి డబ్బులు చెల్లించే పరిస్థితి లేకుండా ఉపాధి కూలీలు నేరుగా ఉచితంగా పళ్లాలు తవ్వడం రైతులకు బాగా ఉపయోగపడుతుంది. దీంతో పాటు పూడుకుపోయి, తుప్పలతో మూసుకుపోయిన పంట బోదెలు, కాలువలను కూడా ఉపాధి హామీ పథకంలో ఆధునీకరించడం రైతులకు బాగా కలిసివస్తోంది.

575 పనుల నిర్వహణ..

పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల పరిధిలో ఉపాధిహామీ పథకం ద్వారా 575 పనులు నిర్వహిస్తున్నారు. 6,788 మంది కూలీలు ప్రతి రోజు ఈ పనుల్లో పాల్గొంటున్నారు. ఇళ్ల స్థలాల లెవెలింగ్‌కు సంబంధించి 223 పనుల్లో 311 మంది కూలీలు పనులు చేస్తున్నారు. కొబ్బరిచెట్ల చుట్టూ పళ్లాలు తవ్వేందుకు 142 పనుల్ని గుర్తించారు. 3,059 మంది కూలీలు ఈ పనులు చేస్తున్నారు. ప్లాంటేషన్, ఇతర పనులకు సంబంధించి 212 పనుల్లో 3,419 మంది పాల్గొంటున్నారు.

రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది



నాకు నాలుగెకరాలు కొబ్బరి తోట ఉంది. ఈ భూమిలో ఎకరానికి 110 చెట్లు వంతున 400కు పైగా కొబ్బరి చెట్లు ఉన్నాయి. గతంలో చెట్టుకు రూ.60 ఇచ్చి పళ్లాలు తవ్వించే వాడిని. కానీ రెండేళ్ల నుంచి ఉపాధి కూలీలు ఉచితంగా చెట్ల చుట్టూ పళ్లాలు తవ్వడం వల్ల నాకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. నాతో పాటు లంక గ్రామాల్లోని ప్రతి కొబ్బరి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

– కుంపట్ల చిట్టివెంకటేశ్వరరావు, రైతు, బి.దొడ్డవరం

ఆసరాగా నిలుస్తోంది



ఉపాధి హామీ పథకం వల్ల గతంలో అంతగా ఉపయోగం ఉండేది కాదు. నాలుగేళ్ల నుంచి ఈ పథకం రైతులకు ఎంతో మేలు చేస్తోంది. పంట కాలువలను అభివృద్ధి చేస్తున్నారు. కొబ్బరి చెట్ల చుట్టూ పళ్లాలు తవ్వుతున్నారు. నాకు ఎకరం కొబ్బరి తోట ఉంది. అందులో 132 చెట్లు ఉన్నాయి. వాటి చుట్టూ ఉపాధి కూలీలు పళ్లాలు తవ్వారు. దీని వల్ల నాకు వేలాది రూపాయలు మేలు జరిగింది. చాలా మంది రైతులు ఈ పథకం ద్వారా మేలు పొందుతున్నారు.

– నల్లి జయమూర్తి, రైతు, పెదపట్నంలంక

38 పనులు చేపట్టాం



ఉపాధి హామీ పథకం ద్వారా మండల పరిధిలో 38 పనులు చేపట్టాం. ప్రతి రోజూ 503 మంది కూలీలు పనులు చేస్తున్నారు. వీటిలో 28 పనులు కొబ్బరి చెట్ల చుట్టూ పళ్లాలు తవ్విస్తున్నాం. మూడు పుంత రోడ్ల నిర్మాణం. మిగిలినవి పీల్ ఛానల్స్ అభివృద్ధి పనులు ఉన్నాయి. రోజుకు రూ.1.25 లక్షలు వ్యయంతో ఉపాధి పనులు జరుగుతున్నాయి. రైతులకు ఉపయోగపడే పనుల్ని ఈ పథకం ద్వారా చేస్తున్నాం. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– మేడిది సీతారామ్, ఏపీఓ, ఉపాధి హామీ పథకం

కలెక్టర్ ఆదేశాలతో కాజ్‌వే ఆధునీకరణ

హర్షం వ్యక్తం చేస్తున్న తీర గ్రామాల ప్రజలు



శిథిల కాజ్‌వేను తొలగించి దాని స్థానే చేపట్టిన పునర్నిర్మాణం పనులు

మామిడికుదురు: అప్పనపల్లి ఉచ్చులవారిపేట మార్గంలో శిథిల స్థితికి చేరిన కాజ్‌వే ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం కాజ్‌వే పునర్నిర్మాణం పనులు మొదలు పెట్టారు. శిథిలస్థితికి చేరిన కాజ్‌ను తొలగించి దాని స్థానే కొత్త కాజ్‌వే నిర్మించనున్నారు. దీనిలో భాగంగా పాత కాజ్‌వేను తొలగించారు. దీనిలో భాగంగా ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా పక్క నుంచి బైపాస్ మార్గం ఏర్పాటు చేశారు. ఈ మార్గం మీదుగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. సుమారు అయిదు దశాబ్దాల క్రితం పాటు రేవుపై ఈ కాజ్‌వేను నిర్మించారని చెబుతున్నారు. అప్పటి నుంచి కాజ్‌వే అభివృద్ధికి నోచుకోలేదు. ఇది దెబ్బతిని మధ్యలో దిగబడిపోయింది. కాజ్‌వేకు ఇరువైపులా రోడ్డు ఎత్తు పెరిగింది. కాజ్‌వే మాత్రం పల్లంలోనే ఉండిపోయింది. దీంతో ఏటా గోదావరి వరదలకు ఈ కాజ్‌వే ముంపుబారిన పడుతోంది. దీనిపై నుంచి మూడు నుంచి నాలుగడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. దీని వల్ల మూడు లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో వరద నీటిలో దిగి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. తీర గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గత ఏడాది వరదల సమయంలో కలెక్టర్ హిమాన్షుశుక్లా స్వయంగా పరిశీలించారు. కాజ్‌వే పునర్నిర్మించి ముంపు సమస్యను పరిష్కరిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగా వరదల సీజన్ ముగిసిన వెంటనే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో ప్రతిపాదనలు తయారు చేయించారు. వరద నుంచి లంక గ్రామాల ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా కొత్త కాజ్‌వే నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఎంతో కాలం నుంచి తీర గ్రామాల ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్న కాజ్‌వే ఆధునీకరణకు నోచుకోవడం పట్ల లంక గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కలెక్టర్ చర్యలు చేపట్టడం హర్షణీయమని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముసలమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు



పుంతలో ముసలమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని పెనికేరులో వేంచేసిన పుంతలో ముసలమ్మ అమ్మవారి ఐదో వార్షికోత్సవం పురస్కరించుకుని ఆలయాన్ని ఆదివారం కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలో కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అన్నసమారాధన జరిపిన నిర్వాహకులను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అభినందించారు. సర్పంచ్ వనుం చిన్నావతి, ఎంపీటీసీ యనమదల స్వాతి, పీఏసీఎస్ అధ్యక్షులు జుత్తుక శ్రీనివాసు, వనుం జార్జిబాబు పాల్గొన్నారు.

పోషకాల గని.. ఆరోగ్య ప్రదాయిని



అంబాజీపేటలో విక్రయానికి సిద్ధంగా ఉన్న పుచ్చకాయలు

అంబాజీపేట: వేసవి వచ్చిందంటే చాలు ప్రజల దాహార్తిని తీరుస్తూ ఎన్నో పోషక విలువలు మానవ శరీరానికి అందించడంలో పుచ్చకాయ అద్వితీయమైన పాత్ర పోషిస్తుంది. పుచ్చకాయ పుట్టిల్లు దక్షిణాఫ్రికా. అమెరికాకు పుచ్చకాయ 17వ శతాబ్దంలో పరిచయమైంది. పుచ్చకాయల్లో సుమారు 1203 రకాలు ఉన్నాయి. ఎక్కువగా ఎరుపు రంగులో ఉన్నప్పటికీ ప్రస్తుతం పసుపు, పాల పసుపు, నారింజ తదితర రంగుల్లో కూడా లభ్యమవుతున్నాయి. కొవ్వుశాతం తక్కువ ఉన్న పుచ్చకాయలో చాలా మంది ఎర్రటి గుజ్జును మాత్రమే తింటారు. కాని శాస్త్రవేత్తల ప్రకారం ఎర్రటి గుజ్జు కింద ఉండే తెల్లని గుజ్జులో కూడా ఎన్నో పోషకాలున్నాయని చెబుతున్నారు. 100 గ్రాముల గుజ్జులో శక్తి 130 కిలోల క్యాలరీలు ఉంటాయి. పిండి పదార్థాలు 7.5 గ్రాములు, పీచు పదార్థాలు 0.4 గ్రాములు, ప్రొటీన్లు 0.6 గ్రాముల నీరు 91.5 శాతం, విటమిన్ 3 శాతం, విటమిన్-సి 8.1 మిల్లీ గ్రాములు, కాల్షియం 7 మిల్లీ గ్రాములు, ఐరన్ 0.24 మిల్లీ గ్రాములు, మెగ్నీషియం 10 మిల్లీ గ్రాముల, పాస్పరస్ 11 మిల్లీ గ్రాములు, పొటాషియం 112 మిల్లీ గ్రాములు, జింక్ 0.1 మిల్లీ గ్రాములు ఉన్నాయి. చాలా మంది పుచ్చకాయ గింజల్లోను పోషకాలు ఎన్నో ఉన్నాయి. పుచ్చకాయ గింజలను ఎండబెట్టి పొడి రూపంలో తిన్న శరీరానికి ఎంతో మంచిది. కొన్ని దేశాలలో పుచ్చగింజల నుంచి నూనె తీస్తారు. పుచ్చకాయలో సెట్రాలీస్ అనే ఫైటో న్యూట్రియంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరంలో ఉన్న ఇతర ఎంజైములతో కలిపి ఆర్జనైన్ అనే అమైనో ఆమ్లంగా మారుతుంది. దీని వల్ల గుండె పనితీరు, రక్త ప్రసరణ మెరుగుపడటం, రోగ నిరోధక శక్తి పెరగటం జరుగుతుంది. పుచ్చకాయల్లో షుగర్ బేబి, అపాయియమటా, జర్కజ్యోతి, ఆర్కా మానిక్, దుర్గాపూర్ రేసన్, మీరా, వసుధ, పుప్రీత్, అపూర్వ, స్వీట్ డ్రాగన్, మహారాజా, నేత్రాపతి, మాధురి తదితర రకాలున్నాయి. పుచ్చకాయ సాగుకు 23 నుంచి 32 డిగ్రీల సెలిక యస్ ఉష్ణోగ్రత అనుకూలం. నదీ పరీవాహక ప్రాంతాలు, ఇసుక తిన్నెలు, బంక మట్టి నేలలు, మురుగు వసతి కలిగిన ఒండ్రు మట్టి నేలలో సాగు చేపడుతున్నారు.

ఉమామహేశ్వరులకు అభిషేకాలు, కుంకుమ పూజలు



విశేష అలంకరణలో పలివెల ఉమాకొప్పేశ్వరస్వామి



విద్యార్థుల నృత్యప్రదర్శన

కొత్తపేట: మండలంలోని పలివెల ఉమా కొప్పేశ్వర స్వామి, మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి వార్ల ఆలయాల్లో ఆదివారం స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పార్వతీదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. పలివెల దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ, దేవస్థానం ఈఓ నడింపల్లి వీఎస్ఎస్‌వీ ప్రసాదరాజు ఆధ్వర్యంలో ఉదయం నుంచీ వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవారిని విశేషంగా అలంకరించారు. మహాశివరాత్రి పురస్కరించుకుని శనివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో కాంతిభారతి విద్యాసంస్థల విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఆయా ఘట్టాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సంగీత విభావరి నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, మరలా రాత్రి భక్తులకు అల్పాహారం సమకూర్చిన రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు, కాంతిభారతి విద్యా సంస్థల కరస్పాండెంట్ టి.సత్యవాణి, వలంటరీ సేవలందించిన విద్యార్థులను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, ఎంపీపీ మార్గన గంగాధరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ అభినందించారు. మందపల్లి శనైశ్చరాలయంలో దేవస్థానం ఈఓ సింగం రాధ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేదపండితులు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

తారకరత్నకు ఘన నివాళి

ఆలమూరు: సినీనటుడు తారకరత్న (40) సంతాప సభ ఆదివారం జరిగింది. కాకతీయ కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో కొత్తూరు సెంటర్‌లోని ఎస్‌జేఆర్ కల్యాణ మండలంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి సంఘ సభ్యులు హాజరయ్యారు. అలాగే జొన్నాడలో మహాదాతగా పేరుగాంచిన బొబ్బా సత్యనారాయణమూర్తి వర్ధంతిని జరుపుకొన్నారు. కమ్మ మహాజన సంఘం గౌరవ అధ్యక్షులు వంటిపల్లి పాపారావు, అధ్యక్షులు దొడ్డపునేని త్రినాథరావు నేతృత్వంలో తారకరత్న, సత్యనారాయణమూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు, సర్పంచ్ గుణ్ణం రాంబాబు, గన్ని విష్ణు, నామాల రుద్రయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రోమోడయోలిన్ పంపిణీ

అంబాజీపేట/ఆలమూరు: మండలాల్లోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆయా మండల ఏఓలు సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఎస్.లక్ష్మీలావణ్యలు తెలిపారు. గ్రామాల్లో ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు.

దేశ సంక్షేమం కోసం ప్రార్థనలు

సఖినేటిపల్లి: మండలంలోని అప్పనరామునిలంకలో ఆదివారం స్థానిక లిటిల్ ఫ్లాక్ సంఘంలో సేవకులు దేశసంక్షేమం కోసం ఏసు ప్రభువును స్తుతిస్తూ ప్రార్థనలు నిర్వహించారు.

కొత్తపేటలో పందుల బెడద

కొత్తపేట: స్థానికంగా ఎక్కడకెక్కడ పందుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పందుల యజమానులు వాటిని వదిలేయడంతో వీధుల్లో, ఇళ్ల పెరట్లలో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. పెరట్లలో చొరబడి మొక్కలు ధ్వంసం చేస్తున్నాయి. ఇటీవల వైరస్‌తో పందులు చనిపోయాయి. పలుచోట్ల మొక్కలు, ప్రహరీల చాటున చనిపోవడంతో దుర్గంధం వస్తే గాని గుర్తించలేని పరిస్థితి. వాటి గురించి పంచాయతీకి సమాచారం ఇవ్వడంతో పూట, రోజు వ్యవధిలో చనిపోయిన పందులను తొలగిస్తున్నారు. ఆ దుర్గంధం భరించలేక ఆ పరిసర ప్రాంతాల నివాసితులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో పందులు తిరగకుండా వాటిని కట్టడి చేసేలా ఆ యజమానులను హెచ్చరిస్తూ తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు పంచాయతీని కోరారు.

రాంబాబుకు సత్కారం

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఉత్తమ అవార్డుకు ఎంపికైన సందర్భంగా కాకతీయ కమ్మ మహాజన సంఘం మండలశాఖ ఆదివారం ఘనంగా సత్కరించింది. ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్‌లోని ఎస్‌జేఆర్ కళ్యాణ మండపంలో గౌరవ అధ్యక్షుడు వంటిపల్లి పాపారావు, అధ్యక్షుడు దొడ్డపునేని త్రినాథరావు ఆధ్వర్యంలో కమ్మ సంఘం సభ్యులు దుశ్శాలువ, పూలమాల వేసి సత్కరించి మెమెంటో బహూకరించారు.

కనకదుర్గమ్మకు 108 కలశల పూజ



పి.గన్నవరంలో కనకదుర్గమ్మకు సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తున్న మహిళలు

పి.గన్నవరం: స్థానిక ఏజీ రోడ్డులో వేంచేసిన శ్రీలక్ష్మీ కనకదుర్గమ్మ వారి ఆలయ 28వ వార్షిక మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా మహిళలు 108 కలశలతో పవిత్ర వైనతేయ నదీ జలాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ అర్చక స్వామి వాడపల్లి గోపాల్ (రాంబాబు) ఆధ్వర్యంలో అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పినిశెట్టి బాబ్జీ భవానీ ఆధ్వర్యంలో అమ్మవారికి దుర్గా హోమం జరిగింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన నిప్పుల గుండంలో భవానీ మాలధారులు, భక్తులు నడచివెళ్లి భక్తిని చాటుకున్నారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ నాయకుడు అడ్డగళ్ల నారాయణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో నాయకులు కొండా భాస్కరరావు, ముషిణి నర్సింహమూర్తి, సుంకర వెంకటకృష్ణ, అడ్డగళ్ల శ్రీను, చెల్లుబోయిన శ్రీను, యర్రంశెట్టి రామకృష్ణ, అడ్డగళ్ల చిన పుల్లారావు, రుద్రా గంగారావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బుద్ధుడి విగ్రహం ఏర్పాటు

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడి బాలయోగి కాలనీ వద్ద గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు మద్దెల వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచ్ వారా జయసావిత్రి, పిల్లి రాంబాబు, మద్దా చంటిబాబు, బొక్కా రామచంద్రరావు, మోర్త సత్తిబాబు, మట్టా వెంకట్రావు, మాగాపు ఈశ్వరరావు, గిడ్ల సురేష్, మల్లేశ్వరరావు, జంగా కృష్ణమూర్తి, వడ్డి శ్రీను, కన్నీడి గిరిబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంక్షేమాన్ని వివరించండి... చైతన్యం తీసుకురండి

ఎమ్మెల్యే చిట్టిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకువచ్చే బాధ్యత కన్వీనర్లు, గృహ సారథులపై ఉందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరంలో క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన సమావేశానికి మండల కన్వీనర్ జక్కంపూడి వాసు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిట్టిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడాను ప్రజలకు వివరించి వారిని కార్యోన్ముఖుల్ని చేయాలన్నారు. గతంలో పార్టీ నేతలకే పథకాలు అందేవని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పార్టీలతో ప్రమేయం లేకుండా అన్ని వర్గాలకు మేలు జరిగే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారని చెప్పారు. అన్ని కులాలకు, మతాలకు మేలు చేసే విధంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎన్ని విపత్కర పరిస్థితులు ఎదురైనా ప్రతి సంక్షేమ పథకాన్ని నిరాటంకంగా కొనసాగిస్తున్న ఘనత జగన్‌కే దక్కిందన్నారు. రాబోయే ఎన్నికల్లో సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్షగా నిలుస్తాయని చిట్టిబాబు పేర్కొన్నారు. ఈ నెల 23 నుంచి ప్రతి గ్రామంలో పార్టీ సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీ శ్రేణులతో మమేకమవుతామన్నారు. సమావేశంలో అప్పనపల్లి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్లు కటకంశెట్టి ఆదిత్యకుమార్, యూవీవీ సత్యనారాయణ, ముత్యాల నర్సింహారావు, సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, ఎంపీటీసీలు నెల్లి దుర్గాప్రసాద్, గెడ్డం మహాలక్ష్మమ్మ, పార్టీ నేతలు కుసుమ శ్రీధర్, తులా గోపాలకృష్ణ, తేతల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం



విలసవిల్లి మహా సౌరయాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

పి.గన్నవరం: స్వచ్ఛంద సేవలు సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. కె.ఏనుగుపల్లిలో ఆదివారం ఎస్ఆర్ఎం జీవన్న థామస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన సేవాసంస్థ ప్రతినిధులను ఆయన అభినందించారు. మొత్తం 275 మందికి వైద్య సేవలు అందించారు. రూ.35 వేల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ తోలేటి బంగారునాయుడు, సంస్థ ప్రతినిధులు, ఎంపీటీసీ కొల్లే సూర్యనారాయణ, నాయకులు దొమ్మేటి దుర్గారావు, యల్లమెల్లి వరప్రసాదరావు, కొల్లే శ్రీను, శ్రీనివాస రావు, గంధం ఏసు, శేరు మంగాదేవి, పితాని నాగన్న, కడలి సీతారాముడు తదితరులు పాల్గొన్నారు.

విలసవిల్లిలో నవగ్రహ నక్షత్ర పూజలు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి రామాలయంలో నవగ్రహ నక్షత్ర పూజలు ఘనంగా జరుగుతున్నాయి. యాగకర్త మున్నంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, సన్ స్పిరిట్యువల్ సొసైటీ వ్యవస్థాపకుడు విక్రమాదిత్య, గ్రామ సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి, నగరం పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్, కూన సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ మహరాజ్ జయంతి

అమలాపురం టౌన్: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను అమలాపురంలో హైందవ బంధువులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గడియారం స్తంభం సెంటర్ నుంచి బైక్ ర్యాలీ చేపట్టారు. ఛత్రపతి శివాజీని స్మరిస్తూ ర్యాలీ సాగింది. భరతమాత స్వేచ్ఛ కోసం వీరోచితంగా పోరాడిన ఛత్రపతి శివాజీ సేవలు చిరస్మరణీయమని పలువురు హిందువులు నినదించారు.

డ్రైవర్ చాకచక్యంతో తప్పిన ముప్పు



అంతర్వేదిపాలెంలో చాకలిచెరువులోకి తిరగబడిన ట్రాక్టర్

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ చాకచక్యంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు, బైక్‌పై ఎదురుగా వస్తున్న మరో యువకుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం, గ్రామంలోని వైష్ణవ కొట్లుకు సమీపాన మలుపు వద్ద పూర్వం నుంచి ఉన్న చాకలిచెరువు వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. టేకిశెట్టిపాలెం వద్ద నుంచి ఇటుకల లోడ్‌తో మోరి వైపునకు ట్రాక్టర్ వెళుతోంది. చాకలిచెరువు వద్ద మలుపులోకి ట్రాక్టర్ వచ్చే సరికి ఎదురుగా బైక్ వస్తున్న మరో యువకుడు, ట్రాక్టర్‌కు ఇంజిన్ బ్యాటరీ వైపు ఢీకొట్టాడు. దీంతో సదరు యువకుణ్ణి ట్రాక్టర్ డ్రైవర్ చాకచక్యంతో తప్పించే క్రమంలో ఇటుకల లోడ్ ట్రాక్టర్ అదుపుతప్పి చెరువులోకి తిరగబడింది. ఈ ఘటనలో స్వల్ప గాయాలతో వారిరువురు బయటపడడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. తదనంతరం చెరువులో నుంచి ట్రాక్టర్‌ను పొక్లెయిన్ ద్వారా బయటకు తీశారు. కాగా గతంలో ఇక్కడ మలుపులో పలు రోడ్డు ప్రమాదాలు జరిగాయని స్థానికులు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ ప్రాంతంలో రోడ్డు 7 అడుగులు మేర వెడల్పు చేస్తామని అధికారులు చెప్పారని, ఈ పనులను వెంటనే చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్సీ స్థానం మాదిగలకు కేటాయించాలి



విక్టర్ ప్రసాద్‌ను కలసిన ఎస్సీ సంఘ నాయకులు

మలికిపురం: గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ స్థానం మాదిగలకు కేటాయించాలని రాజోలు నియోజకవర్గ ఎస్సీ సంక్షేమ సంఘ సమావేశం కోరింది. మలికిపురం పూలే-అంబేడ్కర్ భవనంలో ఆదివారం జరిగిన సంఘ సమావేశం ఈ మేరకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అలాగే దిండి అతిథి గృహంలో బస చేసిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను కలసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గెడ్డం ఫిలిప్‌రాజు, కుసుమ చంద్రశేఖర్, నల్లి శివకుమార్, రాపాక మహేశ్, తాడి సహదేవ్, రాపాక లలితకుమారి, దేవ దయానంద్, రాపాక సూర్య, నల్లి బాలకృష్ణ తదితరులు విజ్ఞప్తి చేసిన వారిలో ఉన్నారు.